# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


## లక్ష్యసాధనతో విజయం సాధ్యం

–టిటిడి విద్యాసంస్థల క్రీడా సలహాదారులుగా రజని

తిరుపతి, ఆగస్టు 27ప్రభాతవార్త:



విద్యార్థులు తొలినుంచే పట్టుదలతో, అనుకున్న రంగంపై లక్ష్యసాధనదిశగా కృషి చేస్తే విజయం సాధ్యమని అంతర్జా తీయ హాకీ క్రీడాకారిణి కుమారి రజని ఉద్ఘాటించారు. టిటిడి విద్యాసంస్థల క్రీడా సలహాదారులుగా నియమితులైన ఆమె శనివారం సాయంత్రం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇక్కడ క్రీడాకారిణి రజనిని పద్మావతి మహిళ డిగ్రీ,పిజి కళాశాల విద్యార్థినులు కరచాలనం చేసుకుని ఆమె క్రీడాస్ఫూర్తిని తెలుసుకున్నారు.



శనివారం భక్తులు రద్దీతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం

## కల్వర్టును ఢీకొన్న కారు

### ఇద్దరు మృతి ఆరుగురికి తీవ్రగాయాలు



బంగారుపాళ్యం, ఆగస్టు 27 ప్రభాతవార్త:

చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి కెజి సత్రం క్రాస్ వద్ద శనివారం ఉదయం ఒక కారు కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో పెద్దనాన్నతో పాటు ఆయన తమ్ముడి కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరు మంది ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వెల్లడించిన వివరాల మేరకు... మండలంలోని కరిడివారిపల్లికి చెందిన హేమంత్‌రెడ్డి, మాధవరెడ్డిల కుటుంబీకులు తమిళనాడు వేలూరుకు సమీపంలోని తమ బంధువుల ఇంటికి కారులో బయలుదేరారు. కెజి సత్రం క్రాస్ వద్ద వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన వున్న కల్వర్టును అతి వేగంగా ఢీకొంది. ఇందులో కారు నడుపుతున్న మాధవరెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి(30), ప్రక్కనే కూర్చొని వున్న కార్తీక్‌రెడ్డి పెద్దనాన్న హేమంత్‌రెడ్డి(68) తీవ్రంగా గాయపడి కారులోనే ప్రాణాలు కోల్పోయారు. కారు వెనుక సీటులో కూర్చొని వున్న మాధవరెడ్డి(62), అతని భార్య దేవిక(55), కరిడివారిపల్లికి చెందిన చిట్టెమ్మ(60), అదే గ్రామంకు చెందిన సిద్ధమ్మ(62), తవణంపల్లి మండలం టి.పుత్తూరుకు చెందిన నీలమ్మ(42), బోయపల్లికి చెందిన ప్రభావతమ్మ(50)లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా వున్న నీలమ్మను చీలాపల్లి సిఎంసి ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తున్నారు. కారు ముందు భాగంలో ఇరు క్కు పోయిన కార్తీక్‌రెడ్డిని జెసిబిల సహాయంతో బయటికి తీశారు. అనంతరం హేమంత్‌రెడ్డి, కార్తీక్ రెడ్డిల మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే కరిడివారిపల్లి గ్రామస్తులు, మృతుల బంధువులు, స్నేహితులు, సన్నిహితులు అధిక సంఖ్యలో బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చారు.





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హేమంత్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి

## డిగ్రీలతో పాటు అనుభవ జ్ఞానాన్ని పొందాలి

### కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా.సుభాస్ సర్కార్





శ్రీసిటీ, ఆగస్టు, 27 ప్రభాతవార్త:

డిగ్రీలు పొందడంతోపాటు మంచి అనుభవ జ్ఞానాన్ని సంపాదించాలని, అది జీవితాంతం మీ ఎదుగుదలకు తోడగా ఉంటుందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా.సుభాస్ సర్కార్ విద్యార్థులకు ఉద్బోదించాదు. శనివారం శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫరమేషన్ టెక్నాటజీ (ఐఐఐటి) కళాశాలలో జరిగిన 5వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేయగా, ట్రిపుల్‌ఐటీ శ్రీసిటీ గవర్నింగ్ బోర్డ్ చైర్మన్ ఎం. బాలసుబ్రమణ్యం, గవర్నింగ్ బోర్డు సభ్యుడు మరియు శ్రీసిటీ చైర్మన్ సి.శ్రీనివాసరాజు,క్యాటర్‌పిల్లర్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్ భువన్ ఆనందకృష్ణన్, ట్రిపుల్‌ఐటీ శ్రీసిటీ శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.కన్నబిరాన్ మరియు సెనేట్ సభ్యులు, ప్రముఖ విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వేడుకకు హాజరయ్యారు. డిగ్రీలు పొందిన విద్యార్థులను అభినందించిన డా.సభాస్ సర్కార్ ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతూ, ఉద్యోగాలకోసం ఎదురు చూడకుండా ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎదిగేందుకు లక్ష్యానిన నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీ ఆదిశంకరాచార్యుల భజగోవిందం సూక్తిని ఉదహరిస్తూ, 'జ్ఞాన శక్తితో జ్ఞానోదయం పొందండి' అంటూ విద్యార్దులకు సూచించారు. ప్రదాని నరేంద్రమోడి నాయకత్వంలో దేశంలో స్టార్టప్‌ల స్వర్ణయుగం ప్రారంభమైందన్న మంత్రి, విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించడం ద్వారా వారి ఊహలకు మంచి కోణాన్ని ఇవ్వాలన్నారు. యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. స్నాతకోత్సవంలో 208 మంది బీటెక్, 5 ఎమ్మెస్, 5 పిహెచ్‌డీ మొత్తం 218 మందికి పట్టాలు అందజేశారు.

## అమావాస్య పూజలకు పోటెత్తిన భక్త జనం

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య పూజలకు మూడు రాష్ట్రాల నుంచి భక్త జనం కదలి తరంగాల్లా కదలి వచ్చారు. శుక్రవారం మధ్యాహ్నాం నుంచి శని వారం మధ్యాహ్నాం వరకు అమావాస్య ఘడియలు ఉండటంతో భక్తులు శుక్రవారం రాత్రికే శ్రీకాళహస్తి చేరుకున్నారు. దాంతో పట్టణంలో ఎటు చూసినా భక్త జన సందడి చోటు చేసుకుంది. ఇక లాడ్జిల యజమానుల వ్యాపారమే వ్యాపారంగా సాగింది. పోలీసులు ఆటో డ్రైవర్లను ఎంత కట్టడి చేస్తున్నా, చైతన్యవంతుల్ని చేస్తున్నా భక్తుల్ని నిలువుదోపిడి కొనసాగుతూనే ఉంది. చట్టాలు, అధికారుల నిఘా ఉంటే ఉండని అని తమ వ్యాపారం సాగించుకుంటూ లాడ్జిల యజమానులు, ఆటోల డ్రైవర్లు పంచు కుంటున్నారు.ఇక ఆలయంలో దళారుల దందాపై పత్రికల్లో ప్రత్యేక కథనాలు వెలువడుతుండటంతో ధర్మకర్తల మండలి చైర్మెన్, ధర్మకర్తల మండలి సభ్యులు,ప్రత్యేక ఆహ్వానితులు గేట్ల వద్దనే బైఠాయించి పర్యవేక్షిస్తున్నారు.



పూజలకు కదలి వచ్చిన జనం:

సాధారణంగా శని,ఆది,సోమ,మంగళవారాల్లో రాహుకాల సమయంలో భక్తులు కిటకిట లాడుతుంటారు.ఈ నేపథ్యంలో ఈ శనివారం అమావాస్య ఘడియలు రావటంతో ఆలయం శనివారం ఉదయం ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. ఓ కాల సర్పదోష నివారణ పూజలు జరుపుకోవటానికి మరో వైపా శనీశ్వ రాభిషేకాలకు, ఇంకోక వైప రుద్రాభిషేకాలకు భక్తులు పడిగాపులు పడ్డారు.శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తున్నా లెక్క చేయక కదలి వచ్చారు. వేకువ జాము నుంచి రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు కోసం క్యూలైన్లలో నీరిక్షించటం కనబడింది. అయితే దళారుల దందాల్లో కొందరు దళారులు ధర్మకర్తల మండలి పేరును ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు బాహాటంగా ఉంది. గేట్ల వద్ద ఉన్న సెక్యూరిటి,హోంగార్డులు కూడా పాలకుల పేర్లు చెప్పటంతో మౌనం వహించక తప్పటం లేదు.దాంతో దళారుల వ్యాపారం సజావుగా విజయవంతంగా సాగుతుంది. దళారులు ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసియే లోపలకు తీసుకెళ్ళి అంతరాలయ దర్శనాలంటూ భక్తులను పిండుకుంటున్నారు. పంచుకుంటున్నారు. ఇక్కడ ఉచిత సేవకులను పూర్తిగా కట్టడి చేయనిదే వ్యవస్థలో ఎంత మంది నిఘా ఉన్నా, పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నా ప్రయోజనం సున్నా! మరి ఆ దిశగాకాకుండా గేట్ల వద్ద కూర్చుంటే ఏం ప్రయోజనం ఉండదు.

### గిరిజన వసతిగృహ పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం!

4లో

## మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్‌కు భారత్‌వర్చువల్ వర్సిటీ డాక్టరేట్



డాక్టరేట్ స్వీకరిస్తున్న బగ్గిడిగోపాల్

పుంగనూరు రూరల్,ఆగస్టు 27 ప్రభాతవార్త :

స్థానిక మాజీ శాసనసభ్యుడు,బిజెపి రాష్ట్రనాయకుడు బగ్గిడిగోపాల్‌కు ఢిల్లీకు చెందిన భారత్‌వర్చువల్ వర్సిటీ గౌరవడాక్టరేట్ ప్రదానం చేసింది.ఈమేరకు ఆయన అవార్డును శనివారం ఢిల్లీలో అందుకున్నారు. సామాజిక సేవలతో పాటూ,విద్యారంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు వర్సిటీ నిర్వాహకులు అందులో పేర్కొన్నారు. రాజకీయరంగంతో పాటూ సినిమా దర్శకనిర్మాతగా కూడా తన బయోపిక్‌ను విడుదలచేసిన బగ్గిడిగోపాల్ తన జీవితంలో ఎన్టీఆర్ విధానాలతో వ్యతిరేఖించినప్పటి నుంచి వార్తల్లోకెక్కుతూనే ఉన్నారు. పట్టణంలో బగ్గిడిరెడ్డెమ్మ విద్యాసంస్థలు నిర్వహిస్తున్న బగ్గిడిగోపాల్‌కు డాక్టరేట్ ప్రదానం కావడం పట్ల సినిమారాజారెడ్డితో పాటూ ఆయన సన్నిహితులు స్నేహితులు అభినందనలు తెలిపారు.

### ఉష్ణోగ్రతలు

27/8/2022



- తిరుపతి 32 డిగ్రీలు
- చిత్తూరు 34 డిగ్రీలు
- మదనపల్లి 29 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 34 డిగ్రీలు
- వెంకటగిరి 35 డిగ్రీలు
- గూడూరు 34 డిగ్రీలు

### బంగారం ధరలు

27/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,805

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,242

### కోడిగ్రుడ్ల ధరలు

27/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

## మాజీ ఎమ్మెల్సీ గౌనివారి సహా పలువురు టిడిపి నేతల అరెస్ట్

### కుప్పం..రామకుప్పం సంఘటనల్లో 60మందిపై కేసులు నమోదు



కుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో పోలీసులు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుతో సహా పలువురు దేశం నేతలను అరెస్ట్ చేశారు. రామకుప్పం దేశం నేత మునస్వామి, మణి, అప్పు తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. వీరిని శనివారం కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్‌కు మేజిస్ట్రేట్ ఆదేశించారు. కాగా వీరితో పాటు మొత్తం రామకుప్పం, కుప్పం పోలీస్ స్టేషన్ల పరిధిలో వైకాపా నేతల ఫిర్యాదు మేరకు సుమారు 60మందిపై కేసులు నమోదయ్యాయి. వీటిలో రామకుప్పం పిఎస్ పరిధిలో పలువురు తెదేపా నేతలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద సైతం కేసులు నమోదైనట్లు తెలిసింది. ఈనెల 25వతేది కుప్పంలో పోలీసు అధికారుల విధులకు అడ్డగించి పోలీసులపై దౌర్జన్యం చేస్తూ దాడికి దిగారని కొంతమంది తెదేపా నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయని సమాచారం. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గౌనివారి మాట్లాడుతూ శని వారం తామే స్వయంగా వచ్చి లొంగిపోదామనుకున్నామని తామేమీ ఉగ్రవాదులు కాదని పేర్కొన్నారు.

## అక్టోబర్ నాటికి సచివాలయాలు పూర్తి చేస్తాం



తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 27 ప్రభాతవార్త :

తిరుపతిలో జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు 1303 మంజూరు అయ్యాయని, నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, రానున్న అక్టోబరు మాసంలోపు పూర్తి చేయనున్నామని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి వివరించారు. శనివారం మధ్యాహ్నాం ప్రత్యేక కార్యదర్శి జవహర్‌రెడ్డి అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల పురోగతిపై సమీక్షించగా జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీర్ శంకర నారాయణ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యాతా భవనాలైనా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ రానున్న అక్టోబర్ మాసానికి పూర్తి చేయనున్నామని తెలిపారు. జిల్లాలో మంజూరు కాబడిన 484 సచివాలయ భవనాలకుగాను 286, 434 రైతు భరోసా కేంద్రాలకు గాను 182, విలేజ్ హెల్త్ క్లినిక్స్ 385 గాను 110 పూర్తి అయ్యాయని వివరించారు. మరో రెండు మాసల్లో పూర్తి కావడానికి లక్ష్యాలు నిర్దేశించి వేగవంతం చేస్తామని వివరించారు. ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ దశల వారి నిర్మాణాలు బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, మరో వారం లోపు పెండింగ్ లేకుండా బిల్లులు జమకానున్నాయని వివరించారు. అలాగే మాసపు లక్ష్యాలు నిర్దేశించి ఖర్చు కాగల మొత్తం కూడా తెలుపుగలిగితే నిధులు విడుదల ఆలస్యం లేకుండా మంజూరుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.

## మట్టి వినాయక ప్రతిమల తయారీలో... ఎమ్మెల్యే చెవిరెడ్డికి "ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్"లో స్థానం





తిరుపతిరూరల్, ఆగష్టు27 ప్రభాతవార్త:

ప్రభుత్వ విప్, తుడా చైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ప్రతిష్టాత్మక " ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్"లో స్థానం లభించింది. పర్యావరణ హితాన్ని కోరుతూ లక్షా 24వేల మట్టి విగ్రహాలను తయారు చేయిం చడంతో పాటు వాటిని ప్రజలకు ఉచితంగా ఇంటిం టికి అందించడంలో విశేష కృషి చేస్తున్న నేపధ్యంలో అవార్డుకు అర్హత సాధించారు. శనివారం తిరుపతిరూరల్ మండల పరిధిలో చిగురువాడలో మట్టి వినాయక విగ్రహాల పంఫిణి కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి చేస్తున్న కృషిని గుర్తిస్తూ "ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్" సంస్థ ప్రతినిధులు అవార్డుతో పాటు గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేసారు. అంతే కాకుండా తమ సంస్థకు శాశ్వత సభ్యత్వాన్ని కూడా అందించారు. పుడమిని, ప్రకృతిని పరిరక్షించే విధానంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో చెవిరెడ్డి తరహాలో ఎవ్వరూ పర్యావరణ హితం కోరి వేర్వేరు చర్యలు చేపట్టలేదని 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ ప్రతినిధి ఉమా శంకర్ పేర్కొన్నారు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డిని తుడీ వీసి హరికృష్ణ, కార్యధర్శి లక్ష్మీ, ఆకార్డ్ స్కూల్ చైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ దేశచరిత్రలో ఎక్కడా లేనివిధంగా చంద్రగిరి నియోజకవర్గంలో 1.24 లక్షల మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణి చేస్తున్నట్లు తెలిపారు.

## వర్షం వస్తే వనదుర్గాపురం చిత్తడి.. చిత్తడే

### కంటిమీద కునుకు కరువైన గ్రామస్తులు
### ఇళ్ళల్లోకి చేరిన వర్షపు నీరు
### డ్రైనేజీ, రోడ్లు లేక అవస్థలు





వనదుర్గాపురం గ్రామంలో నిల్వ వున్న వర్షపునీరు, పరిశీలిస్తున్న తహసిల్దారు, ఎంపిడిఓల బృందం

పాలసముద్రం, ఆగష్టు 27 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వనదుర్గాపురం పంచాయతీ నీటిలో మునిగిపోయింది. దీంతో గ్రామస్తులు రాత్రి కంటిమీద కునుకు లేకుండా జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో దీర్ఘకాలంగా డ్రైనేజీ కాలువలు, రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో కురిసిన వర్షంలో 60 శాతం వర్షపు నీరు గ్రామంలోని ఇళ్ళలోకి చేరడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. ఓ వైపు భారీ వర్షం కురియడంతో గ్రామ పరిధిలోని విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావడంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో గ్రామం చీకటి ముసురుకొంది. గ్రామ పరిధిలో సుమారు ఏడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామం అంధకారంలో మునిగిపోయింది. ఎక్కడ ఏం వున్నదో తెలియని పరిస్థితి పరిస్థితి. దీనికి తోడు ఎక్కడ చేసినా నీరే. దీంతో గ్రామస్తులు భయాందోళనతో తెల్లవారుజాము కోసం ఎదురుచూశారు. తెల్లవారుజాము అధికారులు వచ్చి ఆదుకొంటారని ఆశలు పెట్టుకొన్న గ్రామస్తులకు నిరాశే మిగిలింది. ఒక్కరంటే ఒక్క అధికారి ఉదయం 11 గంటల వరకు గ్రామ సమీపంలోకి రాలేదు. ఉదయం 11 గంటలకు పైబడి తహసిల్దారు బాబు ఆధ్వర్యంలో ఎంపిడిఓ విద్యావతి, ఇఓపిఆర్డీ రమేష్, విఆర్ఓ తంగరాజ్, కార్యదర్శి జయశంకర్‌లు వచ్చి గ్రామస్తులను పరామర్శించి ప్రభుత్వం తరపున సహాయం చేస్తామని పేర్కొన్నారు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ పలుమార్లు గ్రామంలో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని వేడుకొన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని దీనికి మీరే బాధ్యత వహించాలని వారిని నిలదీశారు. దీనిపై తహసిల్దారు, ఎంపిడిఓలు స్థానిక సర్పంచ్‌ను రోడ్లకు వున్న గుంతలను పూడ్చటంతో పాటు కాలువల్లోని మురుగు నీటిని జెసిబితో సత్వరం తొలగించాలని ఆదేశించారు.

పత్తా లేని ట్రాన్స్‌కో అధికారులు

వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో కురిసిన భారీ వర్షానికి గ్రామం అంథకారంలో చిక్కుకొంటే తక్షణం స్పందించాల్సిన ట్రాన్స్‌కో అధికారులు శనివారం మధ్యాహ్నాం అయినప్పటికీ పత్తా లేకుండా పోయారు. విద్యుత్ స్తంభాలు నేలమట్టం కాగా, పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందికి వంగిపోయాయి. ప్రస్తుతం గ్రామం మొత్తం అంథకారంలో కొట్టుమిట్టాడుతోంది.

# నవరత్నాలతోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం, ఆగస్టు 27 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలో ఇచ్చిన నవరత్నాల అమలుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన సదుంలోని మఠంమిట్ట, రేగల్లురోడ్డు, బలిజవీధి, వారణాసివారి వీధి, సందువీది,పీలేరు రోడ్డులలో గడప గడపకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసు కున్నారు. శుక్రవారం పర్యటన సందర్భంగా జాంద్రపేటలో ఎస్టీల ఇళ్ల వర్షాలకు నానుతున్నాయని పలువురు ద్వారకనాథరెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. దీనితో ఆయన శనివారం అక్కడున్న 18 కుటుంబా లకు తక్షణ సాయం కింద తన సొంత నిధులను వెచ్చించి ఒక్కో ఇంటికి 5 మూటల సిమెంటు, రూ.2500లు నగదును పంపిణీ



చేయించారు. అదేవిధంగా పలువురికి ఇంటి పట్టాలు కావాలని విజప్తి చేశారు. దీనితో అర్హులైన ఐదుగురికి అర్హత పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా తమకు విద్యుత్ చార్జీలు ఎక్కువగా వస్తున్నాయని తగ్గించేలా చూడాలని అంగన్ వాడీ టీచర్లు ఎమ్మెల్యేకు మొరపెట్టు కున్నారు.కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీసోమశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీలు ధనంజ యరెడ్డి,అమరావతి, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ శివశంకర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి,సర్పంచిలువరలక్ష్మి,ఉషారాణి,నారాయణరెడ్డి, శ్రీనివాసు లురెడ్డి ఎంపీటీసీలు ఆనంద,మల్లికార్జున, వాసు ,కోఆప్షన్ మెంబరు ఇమ్రాన్, తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్,ఎంఈఓ శ్రీరాములు,ఏఓ మాధవి, ఏఈలు వినోద్,కృష్ణారెడ్డి,కబడ్డీసంఘం జిల్లా మాజీ కార్యదర్శి మల్‌రెడ్డి, సీహెచ్‌సీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యుడుమురళి,వైకాపానాయకులు బావాజీ, రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సయ్యద్‌బాషా,కాలేషా,పుత్రాజు, కృష్ణయ్య,రామచంద్రయ్య, బోయని గురురాయల్, అంజాద్,చిన్నరమణ,సచివాలయ సిబ్బంది,వీఆర్వోలు, వాలంటీర్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వేగంగా రోడ్ల అభివృద్ధి పనులు

\- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



చిత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ, ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి పలు రోడ్లను పరిశీలించారు. లక్ష్మీనగర్ కాలనీలో భాస్కర హోటల్ నుండి ఎంజిఆర్ విగ్రహం వరకు రోడ్ల అభివృద్ధిపై చేయాల్సి న పనులను అధికారులకు ఆయన సూచించారు. ఈ రోడ్డు అభివృద్ధి కోసం టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు నగరంలోని పలు రోడ్లను ట్రాన్సిస్ట్ ఓరియెంటేషన్ డెవలప్‌మెంట్ కారిడర్ అభివృద్ధి చేయడానికి నగర పాలక అధికారులు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గాంధీ సర్కిల్ నుండి భాస్కర హోటల్ వరకు, ఎంఎస్ఆర్ సర్కిల్ నుండి దర్గా సర్కిల్ వరకు, కోర్టు డౌన్ నుండి సంతపేట వరకు ఈ తరహా రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ ధనలక్ష్మీ, ఎసిపి రామకృష్ణుడు, డిఇ రమణ, టిపిఎస్ శారద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రీ-సర్వే పనులు పరిశీలన



యాదమరి, ఆగస్టు 27 ప్రభాతవార్త:

యాదమరి మండలం కొట్టాలం గ్రామంలో జరుగుతు న్న భూముల రీ-సర్వే పనులను తహసిల్దారు చిట్టిబా బు పరిశీలించారు. కొట్టాలం గ్రామంలో నాలుగు సర్వే బృందాలు భూముల సర్వే కార్యక్రమంను నిర్వహిస్తు న్నాయి. ఈ మేరకు తహసిల్దారు చిట్టిబాబు శనివారం కొట్టాలంగ్రామానికివెళ్ళిసర్వే బృందాలు చేస్తున్న భూములసర్వేవివరాలనుపరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దారు చిట్టిబాబు మాట్లాడుతూ భూముల సర్వేనుపక్కాగాచేపట్టి పూర్తి చేయాలని భూముల రీ-సర్వేకు సంబంధించి రైతులు, గ్రామస్తుల సహకారంను తీసుకోవాలని సర్వే బృందాలను కోరారు.

## రేపు కాణిపాకం ఆలయ పాలకమండలి సమావేశం

కాణిపాకం, ఆగస్టు 27 ప్రభాతవార్త

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి సమావేశం ఈనెల 29న జరుగుతుందని ఆలయ ఈఓ ఎంవి.సురేష్‌బాబు తెలిపారు. ఈమేరకు స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 3 గంటలకు పాలకమండలి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈసమావేశంకు పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## వేరుశెనగలో సస్యరణక్ష చర్యలు తప్పనిసరి

రొంపిచెర్ల, ఆగస్టు27ప్రభాతవార్త



వేరుసెనగలో సస్యరక్షణ చర్యలు తప్పని సరి అని పీలేరు సహాయ వ్యవసాయసంచాలకులు వై.రమ ణారావుఅన్నారు.శనివారం ఆయన రొంపిచర్లలోని రైతు భరోసా కేంద్రం-2 పరిదిలోని పొలంబడి వేరుసెనగపంటనుపరిశీలించారు. వేరుసెనగలో జిప్సం తప్పని సరిగా వాడాలన్నారు. సాగులో సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మినికిట్స్‌లో భాగంగా ఇచ్చిన వరి కొత్తరకం బీపీటీ.3082వరి పొలంను సందర్శించి తగిన సూచనలు చేశారు. పిఎం కిసాన్‌కు అర్హత కలిగిన ప్రతి రైతు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని దీనికి ఆగస్టు 31 చివరి తేదీ అని చెప్పారు. ఈసీజన్‌కు సంబంధించి ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి సుధారాణి, సాంకేతిక వ్యవసాయాధికారి కరుణాకర్‌రెడ్డి, ఏఈఓలు ఇంద్రసేనారెడ్డి, నజీర్, వ్యవసాయ సహాయకులు వెంకటరమణ నాయక్, పీలేరు ఏడీఏ ఆఫీసు సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

## నోటీసులు ఇవ్వకనే అరెస్టులా

\- రాష్ట్ర నేత ఖాదర్ బాషా



కుప్పంరూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త

రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని కుప్పంలో ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తెదేపా నేతలను అరెస్ట్ చేయడం దారుణమని రాష్ట్ర టిడిపి కార్యదర్శి, కుప్పం పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు ప్రతిపక్ష నేతలను వెంటాడి వేటాడుతున్నారని కుప్పంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కౌన్సిలర్ జాకీర్, మాజీ జడ్పీటిసి మునస్వామి తదితరులను రాత్రికిరాత్రే చంద్రబాబు కుప్పం వదిలి వెళ్లగానే అరెస్ట్ చేయడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం నోటీసులు ఇవ్వక అర్ధరాత్రిపూట అరెస్టులు చేయడం దారుణమన్నారు. దేశం నేతలను బేషరతుగా విడుదల చేయాలని పేర్కొన్నారు.

## సిఎం జగనన్న చొరవతో ప్రతి కుటుంబానికి లబ్ధి - ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త



సిఎం జగనన్న చొరవతో రాష్ట్రం లో ప్రతి కుటుంబంకు ఏదో ఓ పథకంలో లబ్ది కలు గుతోందని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శని వారం రేగడదిన్నేపల్లి పంచా యతీలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. పాదయాత్ర సందర్భంగా ప్రజల కష్టాలు తెలుసుకున్న సిఎం జగ నన్న నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. లబ్దిదారుల ఇళ్ల వద్దకే పథకాలు అందిస్తున్న ఘనత వైకాపా ప్రభుత్వంకే దక్కుతుందన్నారు. అర్హులకు పథకాల్లో తప్పక లబ్ది కలిగేలా చూస్తామన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ దండపాణి, రఘురాంరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిచాలి

: ఎమ్మెల్యే వెంకటేగౌడ



గంగవరం, ఆగస్టు 27, ప్రభాతవార్త :

అధికారులు ప్రజా సమస్యలపై ఎప్పటి కప్పుడు స్పందించి సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నా రు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అన్ని పార్టీలకు అతీతంగా, అర్హులైన లబ్దిదారులకు అందేలా చూడాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అధికారులకు సూచించారు.శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి నీరుగట్టి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొంతమంది అధికారులు ప్రజలకు చేరవేయడంలో విఫలం అవుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేయాలని ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించకపోవడం వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో పలు స్థాయి సంఘం సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. .ఈ సమావేశంలో సర్పంచులు చంద్రమ్మ,బాస్కర్‌రెడ్డి, ఎంపిటిసిలు లేఖ్యాబాలు, భారతి మహేష్, కేశవులు, శ్రీధర్, నాయకులు చలపతిరెడ్డి,ఏటిగడ్డ శ్రీరాము లరెడ్డి,పట్టాభి, ఉప సర్పంచ్ మంజునాథరెడ్డి, తహశీల్దార్ మురళి,ఎంపిడిఓ శివప్రసాద్,ఆనందబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్మశానాలను కాపాడాలంటూ ఎమ్మెల్యేకు మహిళలు వినతి

గంగవరం, ఆగస్టు 27, ప్రభాతవార్త :

ఇసుకాసురుల భారీ నుండి శ్మశానాలను కాపాడాలంటూ ఎమ్మెల్యే వెంకటేగౌడకు మహిళలు వినతిపత్రం ఇచ్చారు.శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలోని తాళ్ళపల్లె పంచాయతీ తమ్మిరెడ్డిపల్లె బిసి కాలనీకి చెందిన మహిళలు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని కౌండిన్య నది వద్ద తమ పూర్వీకుల నుండి ఏర్పాటు చేసుకున్న శ్మశాన స్థలాన్ని అక్రమ ఇసుక దారులు ఆక్రమించుకొని అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని దీంతో శ్మశాన స్థలం ఆనవాళ్లు కూడా లేకుండా పోతుందని వాపోయారు. గ్రామస్తులు ప్రశ్నిస్తే ఇసుకాసురులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని తహశీల్దారు మురళిని ఆదేశించారు.

# గడప గడపలో సమస్యల పరిష్కారానికే మనప్రభుత్వం

చౌడేపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త

గడపగడపలో సమస్యల పరిష్కారానికే మన ప్రభుత్వమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మునితుకారామ్, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తిల న్నారు. మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వ్యక్తిగత, సామాజిక అవసరాలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా



మన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళులా పాలన జరుగుతోం దనీ, రాబోయే కాలంలో వైకాపాను ఆదరించాలని వారు కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. దృశ్యకళలు అకా డమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, బోయకొండ ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణ,సర్పంచుభాగ్యవతిహరిబాబు,ఎంపిటీసీ శ్రీరాములు, మాజీ ఎంపిపిలు శ్రీరామ్‌రెడ్డి ప్రకాష్, రుక్మిణమ్మ, మోహన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి,బాకాశ్రీనివాసులు,అన్నిశాఖలఅధికారులు, ప్రజాప్రతి నిధు లు,వైకాపానాయకులు,కార్యకర్తలు,ఆయాగ్రామాలప్రజలుపాల్గొన్నారు

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## టీచర్ల కార్యకలాపాలపై పోలీసుల నిఘా

కోట, ఆగస్టు 27 ప్రభాతవార్త

సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడించాలని ఉపాధ్యా సంఘాలు పిలుపునివ్వడంతో కోట మండలం నుంచి ఆ కార్యక్రమానికి ఉపాధ్యాయులు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు 1న తలపెట్టిన సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని ముందస్తుగా అడ్డుకునేందుకు పోలీసులు ఉపాధ్యాయులపై నిఘా పెట్టారు. గత కొన్నిరోజులుగా సచివాలయాల వారీగా సీపీఎస్ ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. విజయవాడకు వెళ్లే ప్రయత్నంలో ఉన్న వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. సచివాలయ పోలీసులు ప్రత్యేకంగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల కదలికలపై దృష్టి సారించారు. స్థానికంగా ఉద్యమ ఎత్తుగడలను గమనిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచనలు అందాయి. గతంలోనూ జిల్లా నుంచి విజయవాడకు ర్యాలీకి వేలాదిమంది తరలి వెళ్లారు. కట్టడి చేయడంలో భాగంగా ఈ సారి ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. పోలీసుల తీరును గమనించిన పలువురు ఇప్పటికే కనిపించకుండా బయట ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

\- ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి



ఓజిలి, ఆగస్టు 27 ప్రభాతవార్త

ఓజిలి మండల పరిధిలోని 26 గ్రామాల ప్రజలకు ఆగస్టు 31న జరగనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వినా యక పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ నిర్వాహ కులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ డి.ఆదిలక్ష్మి అన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు సమీకృత పోలీసు సేవాకేంద్రం పనిచేస్తుందని తెలిపారు. అగ్నిమా పక శాఖ, విద్యుత్‌శాఖ నుంచి ముందుగానే పొందిన అనుమతిపత్రాలతో పాటు అన్ని వివరాలు ఉన్న అర్జీని అందించాలని ఆమె సూచించారు. ఈ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనల జరిగినా అర్జీదారుడు, కార్యనిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.రాత్రి10గంటలనుంచిఉదయం6గంటలవరకు ఎటువంటి స్పీకర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగిం చరాదని ఆమె స్పష్టం చేశారు.ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ కమిటీలకు ఎస్ఐ సూచించారు.

## ఎంఎల్‌సి కళ్యాణ చక్రవర్తి కుటుంబానికి అండగా ఉంటా

-ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి



వెంకటగిరి ఆగస్టు 27 ప్రభాతవార్త

మాజీమంత్రి బల్లిదుర్గాప్రసాదరావు, ఎంఎల్‌సి బల్లి కళ్యాణ చక్రవర్తి మాతృమూర్తి సరళమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి పరామర్శిం చారు.సరళమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి కళ్యాణ చక్రవర్తి త ండ్రి, తల్లిని కోల్పోవడం బాధాకరమన్నారు.వారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. దివంగత దుర్గాప్రసాద్ తనకు ఎంతగానో సన్నిహితుడని తెలిపారు. ఆయన కుటుంబంతో ఎంతగానో సన్నిహిత సంబంధం ఉందన్నారు, వారి కుటుంబానికి తాను అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట పద్మసాలే కార్పోరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు. వైస్ చైర్మన్ బాలయ్య, న్యాయవాదుల సంఘం కార్యదర్శి లక్కమనేని కోటేశ్వరరావు, కౌన్సిలర్లు గోపాలకృష్ణ, సుబ్బారావు,నారిశేఖర్,సొసైటి అధ్యక్షులు నాగయ్య,రంగనాధం తదితరులు ఉన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టాలి

\- జూనియర్ సివిల్ జడ్జి అనూష



వెంకటగిరి ఆగస్టు 27 ప్రభాతవార్త

బాల్యవివాహాలను అరికట్టాలని జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటా ్లడూతూ బాల్య వివాహాలు చేయరాదని, అలాచేసే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని,వారిచదువేఆస్తి అని తెలిపారు. పిల్లల చేత పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.దివ్యాంగులను గృహనిర్బంధం చేయరాదని తెలిపారు. వారిని కూడా చదివించాలని తెలిపారు. సమావేశంలో ఎంపిపి తనూజరెడ్డి, ఎండిఒ కోటేశ్వరరావు,న్యాయవాదులు డి.రాజారావు,రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాప్రదాత డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

కోట, ఆగస్టు 27 ప్రభాతవార్త

ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కీర్తికిరీటంలో ఎన్నో కలికితురాయిలు పొదిగిన విద్యాప్రదాత జేఎన్‌టీయూ మాజీ వైస్ ఛాన్స్‌లర్, ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీ మాజీ ఛైర్మన్ దివంగత డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి కళాశాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని కళాశాల డైరెక్టర్ డాక్టర్‌వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి నాల్గవ వర్ధంతిని పురస్కరించుకొని ఇంజనీరింగ్ కళాశాలలో గోపాల్‌రెడ్డి కాంస్య విగ్రహానికి విజయకుమార్‌రెడ్డితో పాటు అన్ని విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ



1979లో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విద్యానగర్‌లో ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి తొలి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డిని నియమించారని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి గోపాల్‌రెడ్డి చేసిన కృషి మరువలేమ న్నారు. అంతర్జాతీయ సాంకేతిక కమిటీలకు ఛైర్మన్‌గా, వివిధ పదవు లకు సారథ్యం వహిస్తూ గోపాల్‌రెడ్డి స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగి తన అసమాన ప్రతిభతో రాజీవ్‌గాంధీ వంటి ప్రధానమంత్రుల చేత ఎన్నో పురస్కారాలు అందుకున్నారని చెప్పారు. 30 సంవత్సరాలుగా సాంకేతిక విద్యాబోధన, పరిపాలన నిర్వహణ చూస్తూ ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా, డైరెక్టర్‌గా, వైస్‌ఛాన్స్‌లర్‌గా పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారని విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఆయన భౌతికంగా లేకపోయినా అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు.

## వినాయక చవితికి అనుమతులు తప్పనిసరి

వెదురుకుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త :



వినాయక చవితికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ గోపి శనివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పలు గ్రామాల నుంచి నిర్వహకులను పిలిపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తప్పనిసరిగా వినాయక చవితి వేడుకలను నిబంధనల మేరకు నిర్వహించుకుని పోలీసులకు సహకరించాలని చెప్పారు. ఆగస్టు 31న జరుపుకోనున్న వినాయక చవితి వేడుకలను ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు నిర్వహణకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వేడుకలు నిర్వహణకు ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు అనుమతులు తీసుకోవాలన్నారు. డిజె సౌండ్ సిస్టంట్‌కు, డాన్సు లు వేయడంకు అనుమతులు లేవన్నారు. రాత్రి పది గంటలు తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూ దదన్నారు. పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

వెదురుకుప్పం, ఆగస్టు 27 ప్రభాతవార్త :

మండలంలోని తిరుమలయ్యపల్లె ఉన్నత పాఠశాల ఆవరణంలో నేడు అనగా ఆదివారం నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు తెలిపారు. లయన్ బండి చిరంజీవి రెడ్డి వెంకటేశ్వర అరవింద్ ఆసుపత్రి, తిరుపతి వారి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంపు జరుగుతుందన్నారు.కంటి సమస్యతో బాధపడుతున్న చుట్టు ప్రక్కాల గ్రామాల రోగులు ఆధార్ కార్డు లేదా ఏదైన గుర్తింపు కార్డు తీసుకుని వచ్చి నమోదు చేసుకోని ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవలన్నారు. దగ్గర, దూరపు చూపు, కంటి పొర, శుక్లము, గ్లకోమా, రెటీనా, కార్నియా, ఇతర దృష్టి సమస్యలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు.

అలాగే ఆపరేషన్‌కు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని వారికి రెండు రోజులు ఉండటంకు కావలసిన బట్టలు ఇతర సామాగ్రి తీసుకుని రావాలని చెప్పారు. ఉచిత శిబిరం సేవలను ఉపయోగించుకుకోవాలని కోరారు.

## పాఠశాలలకు కుట్టుయంత్రాలు పంపిణీ

శాంతిపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త



కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా శాంతిపురం మోడల్‌స్కూల్,నడిమూరుమోడల్ స్కూ ల్, కడపల్లి గురుకుల పాఠశాలలకు ఫౌండే షన్ ఛైర్మన్ డా॥ పవన్ కళ్యాణ్ ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ప్రతిభ చూపేవారికి ప్రోత్సా హం ఇస్తుందన్నారు. అనంతరం నలుగురి కి ఉత్తమ రైతులు, ఐదుమంది సమాజ సేవకులు, ఐదుమంది ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులను అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, సలహాదారు డా॥ ఉమాపతి, వైస్ ఛైర్మన్ డా॥ సుధాకర్‌రెడ్డి, కోశాధికారి మునిరత్నం, సభ్యులు రామచంద్రప్ప, చంద్రబాబునాయక్, ప్రిన్సిపాల్ లత, హరిణి, ఢిల్లీబాబు, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు కాటిపేరిలో గడపగడపకూ మన ప్రభుత్వం

చౌడేపల్లి, ఆగస్టు 27 ప్రభాతవార్త

మండలంలోని కాటిపేరి పంచాయతీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, ఎంపిడిఓ సుధాకర్‌లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# పేటలో అక్రమంగా మట్టితరలింపు పట్టించుకోని రెవెన్యూ,పోలీసులు ...

నాయుడుపేట రూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇసుక, గ్రావెల్,మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని ధృడసంకల్పంతో పనిచేస్తుంటే నాయు డుపేటలో పోలీస్,రెవెన్యూ,ఎస్ఈబి అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పడుతున్నాయి. నాయుడుపేట మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామం నుండి కొంతమందిఅక్రమార్కులుమట్టినిఅక్రమంగానాయుడుపేటకు తరలిస్తు న్న సంబంధితశాఖల అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలుఆరోపిస్తున్నారు.నాయుడుపేటలోఇళ్ళప్లాట్లు చదునుచేయుటకు



మట్టికి మంచి గిరాకి ఉండటం ఒక ట్రాక్టరు మట్టి 1000నుండి1500 వరకుపలకడంతోఅక్రమార్కులవ్యాపారంమూడుపువ్వులు ఆరుకాయలు గా సాగుతుంది.అయ్యప్పరెడ్డిపాళెం గ్రామసమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల నుండి కొంతమంది అక్రమార్కులు మట్టిని భారీయంత్రా లతోనాయుడుపేటకుతరలిస్తూలక్షలరూపాయలుదోచుకుంటు న్నారు. నాయుడుపేట కేంద్రంగా ఏదోఒక చోట మట్టి,గ్రావెల్,ఇసుక ప్రతి నిత్యంఅక్రమరవాణాజరుగుతున్ననియంత్రించడంలోఅధికారులు విఫ లమౌతున్నారు.ఇప్పటికైనాజిల్లాఉన్నతాదికారులుస్పందించిఅక్రమ రవాణానునియంత్రించేవిధంగాచర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

# ఇద్దరు గొలుసు దొంగలు అరెస్టు

- రూ.1.20 లక్షల విలువైన బంగారు చైన్లు స్వాధీనం



చిత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త: చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లి ఎన్టీఆర్ కాలనీ పరిసరాల్లోని పొలాల్లో ఆవులు మేపుకొంటున్న ఎగువగుంటపల్లి గ్రామంకు చెందిన సుమతి మెడ నుండి లాక్కెళ్ళిన బంగారు గొలుసు దొంగలను శనివారం చిత్తూరు తాలుకా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు సుమతి ఎన్టీఆర్ కాలనీ పరిసరాల్లోని పొలాల్లో ఆవులు మేపుతుండగా ఇద్దరు వ్యక్తులు ఆమె మెడ నుండి బంగారు గొలుసును లాక్కెళ్ళారు. ఈ విషయంపై సుమతి చిత్తూరు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన తాలుకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మద్దయ్యచ్చారి ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం చిత్తూరు రూరల్ మండలం చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో మాపాక్షి క్రాస్ వద్ద ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. చిత్తూరు చెర్లోపల్లి గ్రామంకు చెందిన శివ రాత్రి వేళల్లో ఇళ్ళలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడి జిల్లా జైలులో రిమాండ్‌లో వున్నాడు. ఆ సమయంలో పాలసముద్రం మండలం ఇనుప రేకుల దొంగతనం కేసులో పాలసముద్రం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూరు జిల్లా ఎస్‌విజి పురంకు చెందిన వినాయకం పరిచయం అయ్యాడు. వీరిద్దరు జైలులో ఒకే గదిలో వుండటంతో సన్నిహితులుగా మారి జైలు నుండి వెలుపలికి వచ్చిన వీరు ఎలాగైనా దొంగతనాలు చేసి ఎక్కువ డబ్బులు ఆర్జించాలని నిర్ణయించి ఒంటరిగా పొలాల వద్ద వున్న మహిళలను టార్గెట్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పొలాల్లో ఒంటరిగా ఆవులు మేపుతున్న సుమతి మెడ నుండి 24 గ్రాముల బంగారు తాళి చైనును లాక్కొని వెళ్ళిపోయారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా ఇన్స్‌పెక్టర్ మద్దయ్యచ్చారి తెలిపారు. ఈ కేసు చేధనలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ రామకృష్ణ, చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఇన్స్‌పెక్టర్ మద్దయ్యచ్చారి అభినందించారు.

## వినాయకసాగర్‌లో నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 27 ప్రభాతవార్త : వినాయక చవితి సందర్భంగా వినాయకసాగర్‌లో జరుగుతున్న ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. వినాయక సాగర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులతో కలసి శనివారం కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను నగర ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఇందుకోసం నగరపాలక సంస్థ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా టిటిడి, అగ్నిమాపక, పోలీస్‌శాఖ, విద్యుత్‌శాఖ, నీటిపారుదల శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిన్న విగ్రహాలను వేరుగా, పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నాలుగు క్రేన్లు ఏర్పాటుచేశామన్నారు. వచ్చి వెళ్లే వారికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలందరూ మట్టి గణపతిలకు పూజచేసి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

**సకాలంలో పూర్తిచేసి ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చాం**



శ్రీనివాస సేతు పనుల వల్ల వినాయక చవితి ఊరేగింపులకు ఇబ్బంది లేకుండా సకాలంలో పనులు పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యలు తీర్చామని కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరుగుతున్న శ్రీనివాస సేతు పనుల్లో వేగం పెంచి పనులు త్వరగా పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనివల్ల నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయన్నారు. అలాగే చవితి ఊరేగింపులకు ఇబ్బందులు తొలగాయన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డి.ఇ విజయకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడదాం

-బాదుడే బాదుడులో టిడిపి పిలుపు



తిరుపతి,ఆగస్టు 27ప్రభాతవార్త: పేదల ఓట్లతో అధికారం దక్కించుకున్న వైసిపి పార్టీ నేతలు,కుర్చీలో కూర్చున్న తరువాత పేదప్రజలను వేధించి, ఛార్జీల భారం మోపిందని టిడిపి నేతలు మండిపడ్డారు. పేదలను ఇబ్బందిపెడుతున్న వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని, మళ్ళీ పేదలకు మంచి జరగాలంటే టిడిపి రావాలని అన్నారు. ప్రభుత్వం భారీగా పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలతోబాటు విద్యుత్ ఛార్జీలు పెంపు, బస్సుఛార్జీల పెంపు ప్రజలపై మోయలేని భారంగా మారిందన్నారు. విద్యుత్‌ఛార్జీలు పెంచి ఇళ్ళలో ఫ్యాన్‌లు తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవాచేశారు. ప్రజలు సమస్యలపై తిరగబడితే అక్రమ కేసులు పెట్టడం, బెదిరించడం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం,ముఖ్యమంత్రి జగన్ మాయ మాటలు నమ్మవద్దని, వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎంగా చూద్దామని పిలుపునిచ్చారు. బాదుడే బాదుడు కార్యక్రమం శనివారం సాయంత్రం పెద్దకాపువీధి, నెహ్రూవీధి, టిపి ఏరియా ప్రాంతాల్లో ఇంటింటికెళ్ళి వైసిపి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, టిడిపి రాష్ట్రకార్యదర్శులు సూరాసుధాకర్‌రెడ్డి, బుల్లెట్‌రమణ, జెబి శ్రీనివాసులు, పులుగోరు మురళి, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, టిడిపి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ, కార్యదర్శి మహేశ్‌యాదవ్, యువత కంకణాల రజినీ కాంత్ నాయుడు, రాష్ట్రయువత ప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు, నాయకులు మునిరామయ్య, ఆముదాల తులసీ,, హేమంత్‌రాయల్, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శంకర్‌యాదవ్, కుమారమ్మ, రేవతి, భారతి, లక్ష్మీ, లతా , రవి, సుబ్బుయాదవ్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## హోం వ్యవహారాల ముసుగులో దోపిడి ముఠా : తస్మత్ జాగ్రత్త

శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో ఓ దొంగల ముఠా సరికొత్త ఎత్తుగడతో ఇంటింటికి వచ్చి సమాచారం సేకరించుకుంటుందని పలువురు చెబుతున్నారు.ఈ ముఠా హోం వ్యవహారాల శాఖ అధికారులుగా నటిస్తుందని చెబుతున్నారు.ఈ ముఠా ఇళ్ళను దోచుకోవటానికి సరికొత్త మార్గం, ప్రణాళిక రచించుకున్నట్లు కొందరు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు చెబుతున్నారు.ఇప్పటికే ఈ ముఠా పలు ప్రాంతాల్లో తిరిగి పరిస్థితిని గమనిస్తున్నారని చెబుతున్నారు. వచ్చిన వారు హోంశాఖకు సంబంధించిన పత్రాలు, లెటర్‌హెడ్‌లు కల్గి ఉన్నారని చెబుతున్నారు.రాబోవు జనాభా గణన కోసం ప్రతి ఒక్కరు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును కల్గి ఉన్నామని ధృవీకరిస్తారు.ఈ ముసుగులు ఇంటి ఆవరణ, వాతావరణంను బేరీజు వేసుకొని దోచుకోవటానికి ప్రణాళిక రచిస్తున్నట్లు చెబుతున్నారు. వచ్చే వారు అధికారుల వలే కనబడతారు. మోస పోవద్దని చెబుతున్నారు.వీరు సైబర్ నేరగాళ్ళని చెబుతున్నారు. వచ్చే వారు నేను ఆయుష్మాన్ భారత్ పథకం కింద సమాచారం సేకరించటానికి వచ్చాను. మీ ఫోటో, మీ బోటన వేలు ముద్ర వేయాలని వివరాలు అడుగుతున్నారని వివరించారు. వారి వద్ద ల్యాప్‌టాప్‌లున్నాయని బయో మెట్రిక్ మిషన్లు తీసుకొచ్చి వివరాలు అడుగుతున్నట్లు కొందరు చెబుతున్నారు.వారికి సమాచారం అందిస్తే ఇక బ్యాంకు ఆకౌంట్‌లోని సొమ్ములు మాయమౌతాయనే విషయాన్ని మహిళలనుచైతన్య పరచాలని చెబుతున్నారు.వచ్చే దోపిడి దారులు ఐడిలు కూడా చూపుతున్నారని రిటైర్డ్ ఉద్యోగులు తమ ఇళ్ళకు వచ్చిన వారి గురించి చెబుతున్నారు. శ్రీకాళహస్తి పరిసరాల్లో ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా లేకుంటే నష్టపోతారని చెబుతున్నారు.

## అనధికారిక విద్యుత్ కోతలతో ప్రజల తిప్పలు-అధికారుల నిర్లక్ష్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అనధికారికి విద్యుత్ కోతలతో ప్రజలు,వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యుత్‌శాఖ అధికారిక విద్యుత్ కోత లేదంటూనే అనధికారికంగా కోతలు విధిస్తున్నారు. దాంతో ఈ ప్రాంతాలకు వచ్చే భక్తులు దిగే అతిధి గృహాల్లో జనరేటర్లు లేదు.దాంతోగదుల్లో ఉక్కపోతను భరించలేకున్నారు.గత పాలనలో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం కాబట్టి రెండవ శనివారాలు నిర్వహణల్లో బాగంగా కూడా నాలుగుమాడావీధులను మినహాయించారు. ఇందుకు అప్పటి పాలకులు లోబావిలో ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించారు.ఈ ట్రాన్స్‌ఫార్మర్ కేవలం శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగు మాడావీదులకు సంబంధించినది. అయితే ప్రస్తుతం కొత్త పాలకులు, కొత్త అధికారుల హయాంలో గత వెసులుబాట్లను అమలు చేయటం లేదు. పుణ్యక్షేత్రం కాబట్టి శనివారం భక్తుల తాకిడి అత్యధికంగా ఉంటుంది.ఈ సమయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో కోత అంటే వ్యాపారుల తిప్పలు వర్ణనాతీతం. తినుబండారాలు తయారు చేసుకోనుటకు ఇబ్బందిగా మారింది. ఇక సాధారణ రోజుల్లో మూడు నాలుగు సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాం కల్గుతుంది. ఒక సారి అంతరాయం కల్గితే కనీసం అర్థగంట కోత విధిస్తున్నారు. దాంతో వ్యాపారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అధికారులు మారితో విధానాలు మారిపోతాయా? పుణ్యక్షేత్రంకు ఉన్న ఉనికి మారిపోతుందా? అనే విమర్శలు చోటు చేసుకున్నాయి. నాలుగు మాడావీధుల్లోనే హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు,వెలసి ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు గత పరిపాలనా పుస్తకాన్ని పరిశీలించి చర్యలు తీసుకొని ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించాలని కోరుతున్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్లపై జాగ్రత్త అవసరం:**




శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో అతిధి గృహాలు అత్యధికంగా ఉన్నాయి.గతంలో నివాసస్థలాలైన ప్రాంతాలు నేడు అతిధి గృహాలుగా మారింది. అయితే కొన్ని లాడ్జిలు తమ సొంత ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు.అయితే గతంలో అధికారులు పలుకుబడికి ప్రాధాన్యత ఇచ్చారు. దాంతో నియమనిబంధనలకు తిలోదకాలిచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల కింద దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ రీడింగ్ తీయటానికి కూడా విద్యుత్‌శాఖ అధికారులు తిప్పలు తప్పటం లేదు. అయినా భరిస్తున్నారు. అక్కడ నిబంధనలంటే రాజకీయ నాయకుని నుంచి ఫోన్లు వస్తాయనే భయం చోటు చేసుకుంది. ఇక కొందరు ట్రాన్స్‌ఫార్మర్లను లాడ్జి గది పక్కనే ఏర్పాటు చేసుకున్నారు. పొరబాటున గది నుంచి చేయి బయటకు చాచితే తగిలే ప్రమాదం చోటు చేసుకుంది. కనీసం సమాచారం కూడా లేకుండా అనధికార విద్యుత్‌కోతలు విధించడంపై విద్యుత్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు కట్టకపోతే మాత్రం సిబ్బంది ఫ్యూజులు తీసివేస్తారని ఆగ్రహిస్తున్నారు. మరి అనధికారిక విద్యుత్‌కోతలకు ఏం సమాధానం చెప్తారో?

## కుళ్లిన కోడిగుడ్లు తిని 20 మంది విద్యార్థులకు అస్వస్థత

విజయపురం, ఆగస్టు 27 ప్రభాతవార్త : మండలంలోని పాతార్కాడు ప్రాథమిక పాఠశాలలో కుళ్లిన కోడిగుడ్లు తిని 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. విద్యార్థుల తల్లితండ్రుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా విద్యార్థులంతా కోడిగుడ్డుతో భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనం చేసిన విద్యార్థులకు రాత్రి వాంతులు, కడుపు నొప్పి, విరేచనాలు రావడంతో తమిళనాడు పీకాక్ ఆస్పత్రికి హుటాహుటిన తీసుకెళ్లారు. ఎందుకు ఇలా జరిగిందని విచారణ నిర్వహించగా మధ్యాహ్నం భోజనంలో తిన్న గుడ్లు కారణమని తెలిసింది. విద్యార్థులు అస్వస్థతకు గురైన సమాచారం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఇఒ ఆంజనేయులు వైద్యులకు సంప్రదించి సమాచారం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకుడు సతీష్‌యాదవ్ ఆస్పత్రికి చేరుకుని వారి వైద్య ఖర్చులను పూర్తిగా చెల్లించి విద్యార్థికి 2000 రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్ వైద్య శిబిరం నిర్వహించి పరీక్షించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు.

## పాతార్కాడు విద్యార్థులకు.. ప్రత్యేక వైద్య సేవల కొరకు మంత్రి రోజా ఆదేశాలు



పుత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త : విజయపురం మండలం పాతార్కాడు ప్రాథమిక పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా శనివారం అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి విద్యార్థులను పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించారు. పాతార్కాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 36 మంది విదా ్యర్థులు వుండగా వారిలో 16 మంది మాత్రమే మధ్యాహ్న భోజన సమయంలో అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే మంత్రి స్పందించి జిల్లా, మండలంలోని విద్య, వైద్య శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు స్వయంగా తన సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డిని పాతార్కాడు గ్రామానికి పంపించారు. ఆయన అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన చికిత్స కోసం తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణి ఆస్పత్రికి శుక్రవారం రాత్రి తరలించారు. 16 మంది విద్యార్థులకు వైద్య సేవలు అందించడంతో పాటు మందుల కోసం శనివారం ఆర్థిక సాయం అందించారు. దాంతో విద్యార్థులు కోటుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలతో వున్నప్పటికీ 36 మందిలో 16 మంది విద్యార్థులు మాత్రం అస్వస్థతకు గురి కావడం పట్ల విచారణ జరపాలని మంత్రి ఆదేశించారు. నగరి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని మిగిలిన పాఠశాలల్లో విద్యార్థులు అస్వస్థతకు గురి కాకుండా ఆరోగ్యంగానే వున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరించి బాధ్యత లేకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రకటనలు చేయడం పట్ల విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్_ం చేస్తున్నారు. విజయపురం మండలం, పాతార్కాడు గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, విద్య, వైద్య శాఖాధికారులు విద్యార్థులు సేవలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు నాణ్యమైన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నట్టు ఎంఇఒ తెలిపారు.

## గిరిజన వసతిగృహ పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- జిల్లా అధికారి తనిఖీలో ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు చేయడంతో వేధింపులు - ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

చిత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త: చిత్తూరు ఎస్టేట్‌లోని గిరిజన వసతిగృహ పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. మదనపల్లి సమీపంలోని తాండాకు చెందిన గిరిజన విద్యార్థిని చిత్తూరు గిరిజన వసతిగృహ పాఠశాలలో టెన్త్ చదువుతోంది. ఇటీవల జిల్లా స్థాయి అధికారి వసతిగృహ పాఠశాల తనిఖీ చేసిన సమయంలో ఆ విద్యార్థిని ప్రిన్సిపల్‌పై మధ్యాహ్న భోజనం సక్రమంగా పెట్టడం లేదని ఫిర్యాదు చేసింది. ఈ విషయంను మనసులో పెట్టుకొని ఆ విద్యార్థినిపై ప్రిన్సిపల్ అనిలాతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఆ విద్యార్థినిపై వేధింపులు అధికం చేశారు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని గురువారం నైల్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు తెలిసింది. అయితే ఈ విషయంను గిరిజన వసతి గృహ పాఠశాల ఉపాధ్యాయ బృందం రహస్యంగా వుంచారు. ఆ విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొంది శనివారం డిశ్చార్జి కావడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది.

**జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విచారణ**

చిత్తూరు గిరిజన వసతిగృహ పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడిందనే విషయంపై జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి శనివారం పాఠశాలకు వెళ్ళి విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పాఠశాల టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు వచ్చిన వార్తలు తప్పుడు వార్తలని ఆయన పేర్కొన్నారు. గిరిజన వసతిగృహ పాఠశాలలో టెన్త్ విద్యార్థిని అనారోగ్యానికి గురైతే స్థానిక సత్యనారాయణపురంలోని ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయించారని పేర్కొన్నారు.

## రెండు సుమో వాహనాలు ఢీ.. ఇద్దరి పరిస్థితి విషమం

కుప్పంరూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త: కుప్పం -కృష్ణగిరి జాతీయ రహదారిలో మండలంలోని నడిమూరు వద్ద శనివారం రాత్రి రెండు సుమో వాహనాలు వేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఈ వాహనాల్లో ప్రయాణిస్తున్న సుమారు 12మందికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడ్డవారు కర్ణాటకలోని కెజిఎఫ్, తమిళనాడు రాజధాని చెన్నైకు చెందిన వారని సమాచారం.క్షతగాత్రులను 108 సిబ్బంది హుటాహుటిన కుప్పం పిఇఎస్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఓ సుమో వాహనం లోతట్టు ప్రాంతంలో పడింది.

## గణనాథుని సన్నిధిలో మాజీ మంత్రి గల్లా దంపతులు



కాణిపాకం, ఆగస్టు 27 ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడు దంపతులు శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్ రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొ న్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. అనంతరం నూతన ప్రధాన ఆలయాన్ని పరిశీలించారు. వారి వెంట ఆలయ మాజీ ఛైర్మన్‌లు జగన్నాథరెడ్డి, మణినాయుడు, నాయకులు మధుసూధన్‌రావు, గోపీనాధన్, తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి రూ.4 లక్షలు విరాళం



కాణిపాకం, ఆగస్టు 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు పలువురు భక్_లు శనివారం రూ.4లక్షలను విరాళంగా అందజేశారు. ఈమేరకు బెంగుళూరుకు చెందిన కమ్మవారిసంఘం తరపున దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకంకు రెండు లక్షలు రూపాయలను విరాళంగా అందజేశారు. అలాగే బెంగుళూరుకు చెందిన లీలా శంకర్‌రావు అనే భక్తుడు శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్ పథకానికి మరో 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దీనితో పాటు బెంగుళూరుకు చెందిన యాగమూర్తి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకానికి 1,00,001 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు వేర్వేరుగా చెక్ రూపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాక

చిత్తూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ మిట్టర్‌సేన్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. అంత్యోదయ పథకంలో మల్లంగుంట గ్రామ పంచాయతీ పరిధిలో తయారు చేసిన అభివృద్ధి ప్రణాళికపై స్థానిక అధికారులతో ఆయన సోమవారం సమీక్షించనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో క్షేత్ర స్థాయి అభివృద్ధి ప్రణాళికలు ఎలా రూపొందిస్తున్నారనే విషయంపై ఆయన స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించనున్నారు. అలాగే సచివాలయ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికపై ఆయన అధికారులతో సమీక్షించనున్నారు.

## ఒక్క చెట్టుకు 65 బ్రహ్మకమలాలు



సదుం, ఆగస్టు 27 ప్రభాతవార్త : సదుం పంచాయతీ దిగువజాంద్రపేటకు చెందిన ఆకుల శ్రీనివాసులు ఇంటిలోని బ్రహ్మకమలం చెట్టుకు శనివారం ఒక్కరోజే 65 పూలు విరగ కాశాయి. సంవత్సరానికి ఒక్క సారి మాత్రమే పూసే ఈచెట్టు పూలు ఇప్పటి వరకు ఆయన ఇంటిలో ఈ సంవత్సరంలోనే 5వ సారి పూయడం గమనార్హం. అన్ని పూలు పూశాయా అని అందరు ఆశ్చర్యపోతున్నారు.

## భక్తిప్రపత్తులతో భజనలతో..దేవునికృపకు పాత్రులు

-మెట్లోత్సవంలో దాససాహిత్యభజనమండళ్ళు



తిరుమల,ఆగస్టు 27ప్రభాతవార్తప్రతినిధి: ఆద్యంతం భక్తిప్రపత్తులతో, భజనలతో దాససాహిత్యప్రాజెక్టు కళాకారులు, భజనమండళ్ల సభ్యులు కాలినడకన అలిపిరి మెట్లమార్గంలో తిరుమలకు చేరుకున్నారు. గోవిందనామస్మరణలతో శనివారం వేకువజామున ఈ కార్యక్రమం చేపట్టారు. భజనమండళ్ల కళాకారులు తిరుమలకు కాలినడకన చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

## శివయ్య సేవలో హాస్యనటుడు రఘుబాబు



శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు శాంతిని ప్రసాదించే దివ్యక్షేత్రంకు కదలి వస్తున్నారు.ఈ నేపథ్యంలో రాజకీయ నాయకులు, సినిమా నటులు, న్యాయ కోవిదులు,వ్యాపారులు అధిక శాతం వస్తున్నారు. శనివారం అమావాస్య ఘడియల్లో ప్రముఖ హాస్య నటుడు రఘుబాబు కుటుంబ సమేతంగా శివయ్య దర్శనానికి వచ్చారు.ఆయనకు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఛైర్మెన్ స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను స్వామి వారి చిత్రపటాలను అందించారు.

## గణనీయంగా కాలసర్పదోష నివారణ పూజలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే కాలసర్పదోష నివారణ, రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా శని,ఆది, సోమ, మంగళవారాల్లో ఈ పూజలను భక్తులు రాహుకాల సమయంలో జరిపించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అమావాస్య ఘడియలు కావటంతో భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. సుమారు 6వేల పూజలు జరిగాయి, ఇక ఉదయం నుంచి పాతికవేల మందది భక్తులు దర్శనం చేసుకున్నట్లు దేవస్థానం రికార్డు చేసింది. కంచుగడప వద్ద పాలకుల నిఘాతో ప్రత్యేక దర్శన టిక్కెట్లు బాగా అమ్ముడు పోయాయి.ఇక శనివారం సాయంత్రం నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. శనివారం ప్రత్యేక దర్శన టిక్కెట్లు రూ.200లు చెల్లించి 2696 మంది, రూ.50లటిక్కెట్లకు చెల్లించి 2519 మంది కొనుగోలు చేసి ప్రవేశించారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కకూడా గణనీయంగా జరిగాయి. రూ.500ల టిక్కెట్ల ద్వారా 3005 మంది, రూ.750టటిక్కెట్లు ద్వారా 1511, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసి 700, రూ.2500 టిక్కెట్లు కొనుగోలు చేసి 443 మంది, రూ.5వేల టిక్కెట్లు ద్వారా విఐపిలు 126 మంది పూజలు జరుపుకున్నారు. రూ.5వేల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద పూజలు జరిపించారు. కాగా అభిషేకాలు 103 మందిని అనుమతించారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 35 జరిగాయి. శనివారం అమావాస్య కావటం రాహుకాల సమయంలో శనీశ్వరాలయం కిట కిట లాడింది. 124 అభిషేకాలు జరిగాయి. ప్రసాదాలు 26వేలు అమ్ముడు పోయినట్లు దేవస్థానం జారి చేసిన సమాచారంలో పేర్కొన్నారు.